




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం సెప్టెంబర్ 18,2026 సంపుటి : 2 సంచిక : 340 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


# అన్యాయాన్ని ఎదిరించడం తెలంగాణ గడ్డ స్వభావం



- పోరాట యోధులకు సీఎం నివాళులు
- ఆత్మగౌరవం, హక్కుల కోసం తెలంగాణ పోరాటం
- సెప్టెంబర్ 17కు చరిత్రలో ప్రత్యేక స్థానం
- రజాకారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం
- 1948 సెప్టెంబర్ 17న భారత్‌లో హైదరాబాద్ విలీనం
- రాచరికం నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్పు
- ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతున్నాం: రేవంత్
- తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలు
- కృష్ణా జలాల వాటా కోసం న్యాయ పోరాటం

**హైదరాబాద్:**
తరతరాల అణచివేత, దోపిడీ, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. "నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు తెలంగాణ పుట్టినిల్లు. అస్థిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల చైతన్యాన్ని రగిల్చింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానముంది. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేతలు.. చివరి దశలో రజాకారుల దౌర్జన్యాలు ప్రజలను కల్లోల పరిచాయి. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది. రజాకారుల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాడారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టారు. ఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం భారత ప్రభుత్వానికి లొంగిపోయారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భమది. ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ పొరుగు రాష్ట్రాలతోనే కాదు.. ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18లక్షలు. దేశ తలసరి ఆదాయం కంటే ఇది 91 శాతం అధికం. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నాం. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టాం." అని రేవంత్ వివరించారు.

# విద్యుత్తు పొదుపుపై ప్రత్యేక దృష్టి అవసరం



- భవిష్యత్తులో విద్యుత్తు అవసరం మరింత పెరుగుతుంది
- ఉత్పత్తితో పాటు పొదుపుకూ ప్రాధాన్యం: భట్టి
- విద్యుత్తు వృథాను అరికట్టాలి
- ఏటా కాదు.. నిరంతర ఇంధన ఆడిట్ అవసరం
- ఆధునిక మోటార్లు, కూలింగ్ వ్యవస్థలతో పొదుపు
- ఏఐతో విద్యుత్తు వృథాను గుర్తించాలి
- తక్కువ విద్యుత్తు వినియోగంతో నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి

**మాదాపూర్,**
తెలంగాణలో వేగంగా సాగుతున్న పారిశ్రామిక అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తితోపాటు పొదుపుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీసీఐఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన '25వ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమిట్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.'స్థిరమైన అభివృద్ధికి ఇంధన సామర్థ్యమే అత్యంత ఆచరణాత్మక మార్గం, తెలంగాణాలో భవిష్యత్తులో విద్యుత్తు అవసరం మరింత పెరుగుతుంది. మెరుగైన మోటార్లు, శీతలీకరణ వ్యవస్థలు, పారిశ్రామిక ప్రక్రియల ద్వారా విద్యుత్తు వృథాను అరికట్టాల్సిన అవసరముంది. ఇంధన ఆడిట్‌ను ఏడాదికి ఒకసారి చేసే తంతులా కాకుండా, నిరంతరం నిర్వహణ ప్రక్రియగా మార్చాలి. పరిశ్రమలు తక్కువ విద్యుత్తును వినియోగిస్తే, వాటి నిర్వహణ వ్యయం సైతం తగ్గుతుంది. ఏఐ వంటి ఆధునిక పరిజ్ఞానంతో విద్యుత్తు వృథాను గుర్తించి, వినియోగాన్ని మరింత సమర్థంగా మార్చుకోవాలి' అని తెలిపారు. కార్యక్రమంలో ఎనర్జీ ఎఫిషియెన్సీ సమిట్ ఛైర్మన్ తేజ్‌ప్రీత్‌సింగ్ చోప్రా, ఎన్‌టీపీసీ ఆపరేషన్, సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్‌శర్మ, శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గణేశ్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి, మహాలక్ష్మి గ్రూప్ ఛైర్మన్ వై.హరిశ్చంద్రప్రసాద్, సీఐఐ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నేషనల్ ఛైర్మన్ సి.శేఖర్‌రెడ్డి, సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలు విడుదల

**హైదరాబాద్:**
పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలను తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) విడుదల చేసింది.

2 లో



# డోర్నకల్ ఎమ్మెల్యే కారులో మంటలు

- పవర్ బ్యాంక్ పేలడంతో క్యాబిన్‌లో అగ్నికీలలు
- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- అప్రమత్తంగా బయటపడ్డ ఎమ్మెల్యే, సిబ్బంది
- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- చింతపల్లి వద్ద ఘటన
- మరో వాహనంలో మహబూబాబాద్‌కు ఎమ్మెల్యే
- పవర్ బ్యాంక్ పేలుడుకు కారణాలపై ఆరా

# కేటీఆర్‌కు పొంగులేటి కౌంటర్

- అఫిడవిట్లలో భూముల వివరాలపై ప్రశ్నలు
- 2004లో భూములు లేవు.. ఇప్పుడు వందల ఎకరాలా?
- అఫిడవిట్లలో నిజాలు రాశారా? అంటూ నిలదీత
- కేసీఆర్ కుటుంబ ఆస్తులపై సమాధానం చెప్పాలని డిమాండ్
- భూముల పెరుగుదలపై లెక్కలు చెప్పాలని ప్రశ్న
- అఫిడవిట్లు, మాటలకు పొంతన ఉందా?
- భూ ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా?



2 లో

**హైదరాబాద్:**
మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటర్ ఇచ్చారు.

# రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?: కేటీఆర్

- కేసీఆర్‌కు 67 ఎకరాలే ఉన్నాయని వెల్లడి
- వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ అంటూ విష ప్రచారం చేశారని ఆరోపణ
- ఆస్తులపై విచారణకు తమ కుటుంబం సిద్ధమని ప్రకటన
- రేవంత్ ఆస్తులపైనా విచారణ జరపాలని సవాల్
- కేసీఆర్‌కు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై బురద చల్లుతున్నారని విమర్శ
- 22ఏ బాధితుల పక్షానే ఉంటాం: కేటీఆర్



మిగతావి 2లో

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రక్రియ షురూ



2లో..

## కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై

# విచారణ షురూ



2లో..

- రెవెన్యూ అధికారులు రంగంలోకి
- ఎర్రవల్లి--వెంకటాపూర్ సరిహద్దుల్లో పరిశీలన
- 325 సర్వే నంబర్‌పై అధికారుల ఆరా
- అసైన్డ్ భూముల వివరాల సేకరణ
- 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశం
- ఫామ్‌హౌస్ విస్తీర్ణం తేల్చే పనిలో అధికారులు
- 388 ఎకరాల అసైన్డ్ భూమిపై ఆరోపణలు
- 295 ఎకరాలు రికార్డుల్లో ఉన్నాయన్న సీఎం



# 22ఏ పాపం బీఆర్ఎస్ సర్కార్‌దే.. భూదోపిడిపై విచారణ చేస్తాం: పీసీసీ చీఫ్

22ఏ పాపం బీఆర్ఎస్ సర్కారుదేనని అన్నారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. కేసీఆర్ పాలనలో భూదోపిడీపై విచారణ జరిపిస్తామని అన్నారు. 2026 సెప్టెంబర్ 17న మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్.. కేసీఆర్ కుటుంబం వేల ఎకరాలను దోచుకుందని ఆరోపించారు.

2లో..

## సెప్టెంబర్ 19న కోదాడలో

# మెగా జాబ్ మేళా




2లో..

- 300 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు
- టాటా, గూగుల్, మైక్రోసాఫ్ట్ సహా దిగ్గజ సంస్థలు
- 3 వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం
- 20 వేల మంది నిరుద్యోగులు వస్తారని అంచనా
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసిన వారికి ప్రాధాన్యం
- యువత సద్వినియోగం చేసుకోవాలి: ఉత్తమ్
- అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

సూర్యాపేట జిల్లా కోదాడలో శనివారం ( సెప్టెంబర్ 19 ) మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాపై నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## నిజాంను పొగిడే నేతలకు

# డీఎన్ఏ టెస్ట్ చేయాలి

2లో..

- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- నిజాం పాలనపై తీవ్ర విమర్శలు
- తెలంగాణ పోరాట చరిత్రను గుర్తు చేసుకోవాలని సూచన
- నిజాంను గొప్పవాడిగా చిత్రీకరించడం సరికాదని వ్యాఖ్య
- అసెంబ్లీలో నిజాంను ప్రశంసించడం సిగ్గుచేటని విమర్శ
- తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో బండి సంజయ్ వ్యాఖ్యలు
- చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని వెల్లడి

**హైదరాబాద్:**
బీజేపీ నేత, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పటేల్ సంకల్పంతో తెలంగాణకు విమోచనం కలిగిందని.. అలాంటిది నిజాంను పొగిడే నాయకులు ఓసారి ఇక్కడి పోరాట చరిత్రను గుర్తు చేసుకోవాలని సూచించారు.



కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ 18,2026

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రక్రియ షురూ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రక్రియ షురూ అయ్యింది. తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ (పట్టభద్రుల) ఎమ్మెల్సీ స్థానాలకుగాను ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి విడుదల చేశారు. వచ్చే మార్చి 2027తో ప్రస్తుత పట్టభద్రుల ఎమ్మెల్సీల పదవీ కాలం ముగియనుండటంతో, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సరికొత్తగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయనుంది రాష్ట్ర ఈసీ. దీనిలో భాగంగా నవంబర్ 1 తేదీ నాటికి డిగ్రీ పూర్తి మూడేళ్లు పూర్తయిన వారందరూ అర్హులు, అయితే గతంలో ఓటు నమోదు చేసుకున్న పాత ఓటర్లు సైతం తప్పనిసరిగా కొత్తగా ఫారం-18ని ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం, వరంగల్--ఖమ్మం--నల్గొండ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంల నుంచి ఆయా సభ్యుల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి కానుంది.

**ఈ ప్రక్రియకు సంబంధించిన వివరాలు..**

- సెప్టెంబర్ 28న ఓటర్ల నమోదు ప్రక్రియకు నోటిఫికేషన్
- నవంబర్ 1, 2026 అర్హత తేదీగా ఓటర్ల జాబితా తయారీ
- నవంబర్ 6 వరకు ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ

**డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**

- గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు తెలంగాణ సీఈఓ కీలక సూచనలు
- ఇప్పటికే ఓటర్ల జాబితాలో పేరున్నవారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి
- ఫారం-18తో పాటు ధ్రువీకరించిన విద్యార్హత పత్రాలు సమర్పించాలి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో అవకాశం
- ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, డిజిగ్నేటెడ్ అధికారుల వద్ద ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు
- పోస్టు ద్వారా ఫారం-18 దరఖాస్తుల సమర్పణకు అవకాశం

# నిజాంను పొగిడే నేతలకు డీఎన్ఏ టెస్ట్ చేయాలి

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో కాస్త తీవ్ర వ్యాఖ్యలే చేశారాయన.

గురువారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్రం నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ఇవాళ నాలుగు పండుగలు ఒకేసారి వచ్చాయని ఆయన అన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, విశ్వకర్మ జయంతి, ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు, తెలంగాణ విమోచన దినోత్సవం ఒకేరోజు రావడం ప్రత్యేకమన్నారు. దేశమంతా 1947లో స్వాతంత్ర్యం పొందితే.. తెలంగాణకు ఏడాది ఆలస్యంగా స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సంకల్పంతో తెలంగాణకు విమోచనం కలిగిందన్నారు.

**నిజాం పాలనపై తీవ్ర వ్యాఖ్యలు**

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, ప్రాణత్యాగాలు చేసి తెలంగాణ ప్రజలు విమోచనం సాధించుకున్నారని బండి సంజయ్ అన్నారు. వీర బైరాన్‌పల్లి, పరకాల, గుండ్రాంపల్లి, నిర్మల్ వెయ్యి ఊడల మర్రి వంటి ప్రాంతాల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. అలాంటి చరిత్రను పక్కనపెట్టి నిజాంను గొప్పవాడిగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.

నిజాంను పొగిడే నాయకులు తెలంగాణ పోరాట చరిత్రను గుర్తు చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీలో నిజాంను ప్రశంసిస్తూ మాట్లాడటం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను దోచుకుని రక్తపాతం సృష్టించిన నిజాం పాలనను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. నిజాంను పొగిడే నేతలకు డీఎన్ఏ పరీక్షలు చేయాలని, అసలు వారు ఈ దేశ పౌరులేనా? లేక విదేశీ డీఎన్ఏ ఉందా? అనేది చూడాలంటూ వ్యాఖ్యానించారు.

**చరిత్రను భావితరాలకు చెప్పాలి**

తెలంగాణ పోరాట చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలను అడ్డుకోవడానికే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని బండి సంజయ్ చెప్పారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమం ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోందని చెప్పారు. గత 12 ఏళ్లలో తెలంగాణకు రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసిన చరిత్ర మోదీ ప్రభుత్వానిదేనని బండి సంజయ్ పేర్కొన్నారు.

**అవినీతిపై విమర్శలు**

కొన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ అభివృద్ధిని విస్మరించి అవినీతికి పాల్పడుతూ.. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడానికే పరిమితమవుతున్నాయని బండి సంజయ్ విమర్శించారు. అవినీతికి తావులేకుండా మోదీ పాలన కొనసాగుతోందని అన్నారు.

తెలంగాణ ప్రజలు ఎలాంటి పాలన కావాలో ఆలోచించుకోవాలని ఆయన కోరారు. అవినీతిమయమైన పాలన కావాలా? అవినీతి రహిత పాలన కావాలా? తెలంగాణ చరిత్రను తెరమరుగు చేసే పాలన కావాలా? లేక ఆ చరిత్రను భావితరాలకు అందించే పాలన కావాలా? అని ప్రశ్నించారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న మోదీకి ప్రతి తెలంగాణ పౌరుడు మద్దతు ఇవ్వాలని బండి సంజయ్ కోరారు.

విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోరాట చరిత్రను పాట, సంగీతం, దృశ్యరూపంలో ప్రజలకు అందించిన ఆకుల నాగేశ్వర్, వందేమాతరం శ్రీనివాస్, దీపికలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# సీఎం రేవంత్ ఆర్డర్స్.. కేసీఆర్ ఫాం హౌస్ భూఆక్రమణలపై రంగంలోకి రెవెన్యూ శాఖ

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ ఎర్రవల్లి ఫాం హౌస్ భూముల వ్యవహారంలో అధికారులు విచారణ మొదలుపెట్టారు. గజ్వేల్ ఆర్డీఓ, మర్కుక్ ఎమ్మార్వో, ఏడీ సుదర్శన్ ఆధ్వర్యంలో భూముల పరిశీలన కొనసాగుతుంది. ఎర్రవల్లి, శివారు వెంకటపూర్, వరదరాజుపూర్ గ్రామాల సరిహద్దుల్లోని 325 సర్వే నెంబర్లో అసైన్డ్ భూములను అధికారులు పరిశీలిస్తున్నారు. 325 సర్వే నెంబర్లోని అసైన్డ్ భూమి గురించి ఆరా తీశారు.

కేసీఆర్ ఫాం హౌస్ పేరుతో చేసిన భూఆక్రమణలపై తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని రెవెన్యూ యంత్రాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభ నుంచే ఆదేశించిన మరుసటి రోజే రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు.

రెవెన్యూ అధికారులకు సరిగ్గా 30 రోజుల సమయం ఇస్తున్నామని, ఈ 30 రోజుల్లోగా పని చేసి ఈ భూమి లెక్క తేల్చకపోతే సంబంధిత అధికారులు మాత్రమే కాదు, బాధ్యులైన మంత్రులపై కూడా నేను చర్యలు తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

కేసీఆర్ ఫాం హౌస్ గురించి సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "1944 సర్వే రికార్డుల ప్రకారం ఎర్రవల్లి గ్రామాన్ని ఆనుకొని 2,447 ఎకరాల భూమి ఉంది. దీని సరిహద్దులో శివార్ వెంకటాపురం గ్రామం ఉంది. ఈ రెండు గ్రామాల సరిహద్దుల మధ్య దాదాపు 300 ఎకరాల భూమి రెండు గ్రామాల రికార్డుల్లోనూ (ఓవర్ ల్యాపింగ్) నమోదై ఉంది. ఈ భూమి ఏ గ్రామానిదన్న వివాదం 1957 నుంచి నలుగుతోంది. ఈ వివాదాస్పద భూమిపై ఉద్యమకారుడినని చెప్పుకునే కేసీఆర్ కన్నుపడింది.

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2017లో చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన, ల్యాండ్ రికార్డ్స్ అప్‌డేషన్‌లో రికార్డులను తమకు అనుకూలంగా మార్చేసుకున్నారు. ఆ 300 ఎకరాలు కొనుగోలు చేసినట్టు కాగితాలు సృష్టించి, ఒక్క కలం పోటుతో కేసీఆర్ ఆ భూమికి యజమాని అయిపోయారు" అని వివరించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వాస్తవ విస్తీర్ణం, అందులో కలిసిన ప్రభుత్వ అసైన్డ్ భూమి లెక్కలు తేల్చాలన్నారు.
"ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుటుంబ సభ్యులందరి పేర్ల మీద రికార్డుల ప్రకారం ఉన్నది 295 ఎకరాల భూమి మాత్రమే. కొనుక్కున్న భూమి ఉంటే ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఈ ప్రాంతంలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాల ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమి ఉంది. 2017లో ల్యాండ్ రికార్డ్స్ డిలీషన్, అప్‌డేషన్ పేరిట అనేక అక్రమ మార్పులు చేసి ఈ అసైన్డ్ భూమిని రికార్డుల నుంచి మాయం చేశారు.

ఈరోజు అధికారిక రికార్డుల్లో ఉన్న 295 ఎకరాలు కాకుండా, ఎలాంటి రికార్డులు లేని ఈ 388 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా చుట్టూ కంచె వేసి కలిపేసుకుని దాదాపు 700 ఎకరాల విస్తీర్ణంలో సామ్రాజ్యాన్ని అనుభవిస్తున్నది పచ్చి నిజం కాదా? ఈ 700 ఎకరాల ఫామ్‌హౌస్ మీ భౌతిక ఆధీనంలో ఉన్నదా లేదా? దీనికి కేసీఆర్ సభకు, రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి" అని సీఎం రేవంత్? రెడ్డి సవాల్ విసిరారు.



# అది వీడియో గేమ్ ఫుటేజ్: పాక్ 'ఫేక్' వార్‌కు భారత్ కౌంటర్

తన అబద్ధపు మాటలు.. అసత్య ప్రచారాలతో అంతర్జాతీయ వేదికలపై ఎన్నిసార్లు భంగపడినా పాకిస్థాన్ బుద్ధి మాత్రం మారట్లేదు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్‌పై పెద్ద ఎత్తున 'ఫేక్' వార్ చేసి నవ్వులపాలైన దాయాది .. ఇప్పుడు మరోసారి మన వాయుసేనపై బురదజల్లే ప్రయత్నం చేసింది. భారత 'మిగ్-29' కూలిపోయిందంటూ నకిలీ వార్తను ప్రచారం చేస్తోంది. కానీ, మన ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం.. ఆ అసత్య కథనాలను ఆధారాలతో సహా నిరూపించి పాక్ గాలి తీసేసింది. అసలేం జరిగిందంటే..
భారత వాయుసేనకు చెందిన మిగ్-29 యుద్ధ విమానం ల్యాండ్ అవుతుండగా కూలిపోయిందని కొన్ని గంటల నుంచి సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగనప్పటికీ.. పైలట్ తప్పిదమే ప్రమాదానికి కారణమనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే పీఐబీ దీనిపై ఫ్యాక్ట్‌చెక్ చేసి వాస్తవాలను వెల్లడించింది. "పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాలు ఈ వీడియోను వ్యాప్తి చేస్తున్నాయి. ఇది పూర్తిగా నకిలీ వార్త. 'వార్ థండర్' అనే వీడియో గేమ్ ఫుటేజీని తీసుకుని మిగ్ కూలిపోయినట్లు ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి అసత్య కథనాల పట్ల అప్రమత్తంగా ఉండండి. కేవలం అధికారిక ఛానళ్ల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించండి" అని పీఐబీ తన ఫ్యాక్ట్‌చెక్ ఖాతాలో పేర్కొంది. దీంతో పాక్ దుర్బుద్ధి మరోసారి బయటపడినట్లయ్యింది.

# ఫోన్ ఈఎంఐ చెల్లించలేదని.. యువకుడిని బందీగా చేసి, రక్తాన్ని విక్రయించి!



ఫోన్ ఈఎంఐ చెల్లించలేదని ఓ యువకుడిని అపహరించిన ఇద్దరు వ్యక్తులు.. నాలుగు రోజులపాటు హింసించారు. అంతటితో ఆగకుండా బలవంతంగా బ్లడ్‌బ్యాంక్‌కు తీసుకెళ్లి అతడి రక్తాన్ని అమ్ముకున్నారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో వెలుగుచూసింది. నిందితులను అనికేత్ సింగ్ అలియాస్ కాకా (26), సుశాంత్ శర్మ (31)గా పోలీసులు గుర్తించారు. బాధితుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. నవల్‌కుమార్ అనే యువకుడు ఈఎంఐలో ఫోన్ కొనుగోలు చేశాడు. అయితే, వాయిదా కట్టలేదంటూ నిందితులు అతడిని కిడ్నాప్ చేశారు.
ఈ క్రమంలోనే నిందితులు తన కుమారుడిని నాలుగు రోజుల పాటు బందీగా ఉంచి, బలవంతంగా పనులు చేయించారని, దాడి కూడా చేశారని నవల్‌కుమార్ తల్లి తెలిపారు. అలాగే, అతడి నుంచి రక్తాన్ని సేకరించి విక్రయించారని ఆరోపించారు. ఈఎంఐ కట్టనందుకు గుణపాఠం చెప్పాలనే ప్లాన్‌లో భాగంగానే నవల్‌ను తమతో తీసుకెళ్లామని సుశాంత్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడిని నాలుగు రోజుల పాటు శుభమ్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో ఉంచి, పనులు చేయించారని.. అలాగే వాయిదా డబ్బు కూడా వసూలు చేశారని పేర్కొన్నారు. శుభమ్ సింగ్‌నూ అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

# డోర్నకల్ ఎమ్మెల్యే కారులో మంటలు.. తృటిలో తప్పిన ?ప్రమాదం

మొదటి పేజీ తరువాయి

డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారులో పవర్ బ్యాంక్ ఒక్కసారిగా పేలడంతో కారు క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా చింతపల్లి గ్రామ పరిసరాల్లో చోటుచేసుకుంది.
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రజాపాలన ఉత్సవాల్లో పాల్గొని జెండా ఆవిష్కరించేందుకు మహబూబాబాద్ కలెక్టరేట్‌కు ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ బయలుదేరారు. అయితే, చింతపల్లి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్న పవర్ బ్యాంక్ పేలడంతో ఒక్కసారిగా కేబిన్‌లో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన ఎమ్మెల్యే, సిబ్బంది వెంటనే వాహనం నుంచి బయటకు దిగడంతో ప్రమాదం తప్పింది. అయితే, డ్రైవర్‌కు మాత్రం స్వల్ప గాయాలు అయ్యాయి.
భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం పెద్దదిగా మారలేదు. అనంతరం ఎమ్మెల్యే మరో వాహనంలో మహబూబాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఆయన ప్రమాదం నుంచి తప్పించుకున్నారని తెలిసి అధికారులు, స్థానికులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, పవర్ బ్యాంక్ పేలడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# 'లెక్కలు చెప్పకుండా ఎదురుదాడి ఎందుకు?'

మొదటి పేజీ తరువాయి

అఫిడవిట్లలో భూముల వివరాలపై కేటీఆర్‌ను నిలదీసిన పొంగులేటి.. కేసీఆర్ ఆస్తులపై ప్రశ్నిస్తే.. కేటీఆర్‌కు ఎందుకంత ఉలికిపాటు?. 2004 అఫిడవిట్‌లో భూములు లేవు.. ఇప్పుడు వందల ఎకరాలు ఎలా?. అఫిడవిట్లలో నిజాలు రాశారా? ప్రజలను మోసం చేశారా?. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు.

పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయన్న కేటీఆర్ వ్యాఖ్యలపై ప్రశ్నలు సంధించిన పొంగులేటి.. అఫిడవిట్లలో ఒకటి.. మాటల్లో మరొకటా? అంటూ నిలదీశారు. తెలంగాణ ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్ కుటుంబానిదే. భూముల పెరుగుదలపై లెక్కలు చెప్పకుండా ఎదురుదాడి ఎందుకు? కేసీఆర్ కుటుంబ ఆస్తులపై సమగ్ర విచారణ జరపాలని పొంగులేటి డిమాండ్ చేశారు.

"అఫిడవిట్లలో పేర్కొన్న భూముల వివరాలను ప్రజల ముందు పెట్టాలి. కేటీఆర్ మాటలకు.. ఎన్నికల అఫిడవిట్లకు పొంతన ఉందా?. భూ ఆరోపణలపై కేటీఆర్ బహిరంగ చర్చకు సిద్ధమా?. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రాజకీయ విమర్శలా?" అంటూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు.

# పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలు విడుదల

మొదటి పేజీ తరువాయి

ఎస్ఐ అభ్యర్థులకు నవంబర్ 29న, కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబర్ 20న రాత పరీక్ష నిర్వహించనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. హోంశాఖ పరిధిలోని పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో 7,437 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసు ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా 5,77,064 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ వి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు.

## సెప్టెంబర్ 19న కోదాడలో
# మెగా జాబ్ మేళా

మొదటి పేజీ తరువాయి

టాటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎల్అండ్‌టీ, రెడ్డీస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా, అపోలో, హెచ్‌ఎంటీ, ఎంఆర్‌ఎఫ్, ఎమిరేట్స్, ఫ్లిప్‌కార్ట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పేటీఎం వంటి సుమారు 300 ప్రముఖ కంపెనీలు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వస్తున్నాయని స్పష్టం చేశారు మంత్రి ఉత్తమ్.
తాను చదువుకునే రోజుల్లో విద్యార్థిగా ఉన్నప్పుడు నిరుద్యోగుల కష్టాలను స్వయంగా అనుభవించానని... యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలోని కంపెనీలు స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని... సుమారు 20 వేల మంది నిరుద్యోగులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని అన్నారు మంత్రి ఉత్తమ్.

ఈ మెగా జాబ్ మేళా ద్వారా దాదాపు 3 వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని అన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగులకు ఎక్కువ అవకాశాలు ఉంటాయని... జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

# 22ఏ పాపం బీఆర్ఎస్ సర్కార్ దే.. భూదోపిడిపై విచారణ చేస్తాం: పీసీసీ చీఫ్

మొదటి పేజీ తరువాయి

ఇక వీలైనంత త్వరగా డీసీసీల నియామకం చేపట్టనున్నట్లు చెప్పారు పీసీసీ చీఫ్. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ విదేశాలకు వెళితే ఆమె స్థానంలో కొత్త ఇంఛార్జి వస్తారని ఈ సందర్భంగా చెప్పారు.
మంత్రి వర్గ విస్తరణ అంశం అధిష్టానం చేతుల్లో ఉందన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలా వద్దా అనేది సీఎం రేవంత్ ఇష్టమని ఈ సందర్భంగా చెప్పారు.

# భూ కబ్జా ఆరోపణలు అవాస్తవం: చంద్రశేఖర్ రెడ్డి



నానక్‌రామ్‌గూడలో భూ కబ్జా ఆరోపణలపై చంద్రశేఖర్ రెడ్డి స్పందించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ వీడియో విడుదల చేశారు. "నానక్‌రామ్‌గూడలో నేను, సునీల్ కలిసి రైతుల దగ్గర చట్టబద్ధంగా 10 ఎకరాలు కొనుగోలు చేశాం. అందులో సునీల్ మూడు ఎకరాలు తీసుకున్నారు. భూమికి సంబంధించిన పత్రాలన్నీ మా వద్ద ఉన్నాయి. మంత్రీ కాస్మోసిస్ భవనం గేట్లు పగులగొట్టారని, సెక్యూరిటీ సిబ్బందిని బెదిరించారన్న ఆరోపణలు అవాస్తవం. అక్రమంగా భూమిలోకి వెళ్లలేదు. మాపై వచ్చిన ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవం" అని పేర్కొన్నారు. తనపై కేసు నమోదైన నేపథ్యంలో చంద్రశేఖర్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ 18,2026

## సింహాచలం జగన్ కుటుంబానికి డీడీఎన్ సభ్యుల పరామర్శ

**కరపత్రం ప్రతినిధి జగిత్యాల, సెప్టెంబర్ 17**



ఇటీవల పరమపదించిన టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, డీడీఎన్ పురోహితులు సింహాచలం జగన్ కుటుంబ సభ్యులను ఉమ్మడి వెల్గటూర్ మండల డీడీఎన్ సభ్యులు గురువారం పరామర్శించారు. జగన్ నివాసానికి వెళ్లిన వారు ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.అనంతరం సంఘం తరపున రూ.22 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సింహాచలం జగన్ మృతి సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో వెల్గటూర్, ఎండపల్లి మండలాల డీడీఎన్ అధ్యక్షుడు పర్వతగిరి ప్రశాంత్ శాస్త్రి, ఉపాధ్యక్షుడు ఉట్నూరి గణేశాచార్యులు, కార్యదర్శి తిప్పర్తి భూమయ్యాచారి, కోశాధికారి పదిరె నారాయణ రావు, సహాయ కార్యదర్శి సింహాచలం నరేష్, మీడియా కన్వీనర్ అహోబలం దీపక్ శర్మ, సభ్యులు తిప్పర్తి గౌరయ్య, కొండపెల్లి శరత్ బాబు, ఆరుట్ల రంగాచార్యులు, మఠం విజయకుమార్, వకులాభరణం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

» కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

» రూ.1,89,958 ఆదాయం.. 3.5 గ్రాముల బంగారం, 210 గ్రాముల వెండి

**కరపత్రం ప్రతినిది జగిత్యాల, సెప్టెంబర్ 17**



కోటిలింగాల శ్రీ కోటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీని విప్పి లెక్కింపు నిర్వహించారు. హుండీ లెక్కింపులో రూ.1,89,958 నగదు ఆదాయం సమకూరినట్లు దేవాలయ కార్యనిర్వహణ అధికారి కే. కాంతారెడ్డి తెలిపారు. అదేవిధంగా మిశ్రమ బంగారం 3 గ్రాముల 500 మిల్లీగ్రాములు, మిశ్రమ వెండి 210 గ్రాములు లభించినట్లు వెల్లడించారు.దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ ఎన్. సుప్రియ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ పి. రమేష్, ధర్మకర్తలు వెంకటేష్, రవి, గ్రామ సర్పంచ్ కోటయ్య, పంచాయతీ కార్యదర్శి ఎన్. శైలజ, అర్చకులు, దేవాలయ సిబ్బంది, సేవా సభ్యులు, వెల్గటూర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.పుష్కరాల పనుల పరిశీలన 2027లో జరగనున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని కోటిలింగాల దేవస్థానంలో చేపట్టాల్సిన అభివృద్ధి, ఆలయ పునర్నిర్మాణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ రాజగౌడ్, వెల్గటూర్ ఎంపీడీవో, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎన్. సుప్రియ పరిశీలించారు. ఆలయ పరిసరాలను పరిశీలించి పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, దేవాలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. పుష్కరాల సమయానికి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు.దేవాలయ అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ 76వ జన్మదినం సందర్భంగా 'మోదీ వాణి' గ్రంథావిష్కరణ

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, సెప్టెంబర్ 17**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన 'మోదీ వాణి --- సేవ ౹ సంకల్పం ౹ వికసిత భారత్' త్రిభాషా గ్రంథాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సంయుక్తంగా ఆవిష్కరించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఉదయం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్, ప్రముఖ రాజకీయ-సామాజిక విశ్లేషకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ఈ గ్రంథాన్ని సంకలనం చేశారు.ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ గత పన్నెండేళ్ల కాలంలో స్వదేశంలోనూ, విదేశాల్లోనూ చేసిన చారిత్రక ప్రసంగాలను లోతుగా పరిశీలించి, ప్రజాదరణ పొందిన ప్రామాణిక వ్యాఖ్యలు, కొటేషన్లను ఇందులో పొందుపరిచారు. మోదీ ఆలోచనలు, పాలనా దృక్పథం, జాతీయ దార్శనికతను సమగ్రంగా ప్రతిబింబిస్తూ ఆయన 76వ పుట్టినరోజు కానుకగా ఈ పుస్తకాన్ని వెలువరించారు.'మోదీ వాణి' గ్రంథ విశేషాలు:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాల నుంచి సేకరించిన ప్రామాణిక కొటేషన్లతో కూడిన సమగ్ర త్రిభాషా సంకలనం.ప్రధాని ప్రసంగించిన అసలు హిందీ వాక్యాలతో పాటు వాటి సహజమైన తెలుగు, ఆంగ్ల అనువాదాలను ఇందులో అందించారు.ప్రధాని అధికారిక ప్రసంగాలు, విశ్వసనీయ ఆధారాలను లోతుగా పరిశీలించి అంశాల వారీగా కొటేషన్లను ఎంపిక చేశారు.ప్రతి వ్యాఖ్యకు సంబంధించిన నేపథ్యం, ప్రసంగ సందర్భం, మూల వివరాలను స్పష్టంగా వివరించారు.సేవ, సంకల్పం, సుపరిపాలన, అంత్యోదయం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, యువశక్తి, రైతు సంక్షేమం, ఆత్మనిర్భర్ భారత్, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ పరిరక్షణ, విశ్వవేదికపై భారత నాయకత్వం వంటి విభిన్న అంశాలను ఇందులో పొందుపరిచారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతకుమార్, జయశ్రీ, కల్యాణ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, డాక్టర్ వేముల అశోక్, టి. వీరేందర్ గౌడ్, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, సీనియర్ నాయకులు శ్రీని రెడ్డి, గోపాల్ జీ, సుభాష్ చంద్ర జీ, రాణి రుద్రమ, పద్మ తదితరులతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

» అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులుం

**కరపత్రం ప్రతినిది బ్యూరో, సెప్టెంబర్ 17**





హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారితో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు హనుమకొండ అదాలత్ సర్కిల్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఎంపీ డాక్టర్ కడియం కావ్య అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ రవి, కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, డీఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ ముస్తాక్ నేహాల్

**కరపత్రం ప్రతినిది హనుమకొండ, సెప్టెంబర్ 17**



హన్మకొండ 58 వ డివిజన్ కు చెందిన మొహమ్మద్ ముస్తాక్ నేహాల్ ను సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా విభాగం చైర్మన్ నవీన్ పెట్టెం ఉత్తర్వులు జారి చేసారు. మొహమ్మద్ ముస్తాక్ నేహాల్ గతంలో యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ గా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, సోషల్ మీడియా వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ గా, హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేసారు. ఈ సందర్భంగా మొహమ్మద్ ముస్తాక్ నేహాల్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాకు ఈ గౌరవప్రదమైన బాధ్యతను అప్పగించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా విభాగం చైర్మన్ నవీన్ పెట్టెం గారికి, నాకు ఈ పదవి రావడానికి సహకరించిన వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారికి మరియు హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాం రెడ్డి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.నాకు అప్పగించిన ఈ పదవికి పూర్తి న్యాయం చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

## ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేయాలి

- గుడిమల్ల రవికుమార్..తెలంగాణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఓదార్పు యాత్ర ప్రారంభం



**కరపత్రం ప్రతినిద్ది/వరంగల్,సెప్టెంబర్ 17**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి న్యాయం చేయాలని తెలంగాణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గుడిమల్ల రవికుమార్ డిమాండ్ చేశారు.ఉద్యమ సమయంలో లాఠీచార్జీలు,అవమానాలు,ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ స్వరాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు,సంక్షేమ పథకాలు,తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు.ఇందులో భాగంగా గుడిమల్ల రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ చౌరస్తా నుంచి తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర తొలి దశను ప్రారంభించారు.నాలుగు రోజులపాటు కొనసాగనున్న యాత్రలో ఉద్యమకారుల ఇళ్లకు వెళ్లి వారి పరిస్థితులను తెలుసుకుని,వారికి జరిగిన అన్యాయాలను గుర్తించే కార్యక్రమం చేపట్టారు.వరంగల్ చౌరస్తా నుంచి పోస్టాఫీస్ అండర్‌బ్రిడ్జి,చాకరాసుకుంట,కిలా వరంగల్ తూర్పు కోట,శివనగర్ మీదుగా చింతల్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ..తెలంగాణ కోసం పగలు,రాత్రి తేడా లేకుండా,తిండి,నీరు లేకుండా ఉద్యమించినప్పటికీ అనేక మంది ఉద్యమకారులకు ఆశించిన ప్రయోజనాలు దక్కలేదన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు జరిగిన నష్టాలను ప్రస్తుత ప్రభుత్వం గుర్తించి వారికి న్యాయం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.ఉద్యమకారులకు పదవులు,సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఓదార్పు యాత్రలో భాగంగా మిగిలిన మూడు రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో పర్యటించి ఉద్యమకారులను కలుస్తామని తెలిపారు.యాత్రను ప్రతి పల్లెకు,ప్రతి ప్రాంతానికి విస్తరించి ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ,ప్రజలు, తెలంగాణ ఐక్యవేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డీజే నిర్వాహకులకు పోలీసుల కౌన్సెలింగ్

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

**కరపత్రం ప్రతినిది /వరంగల్,గీసుకొండ మండలం,సెప్టెంబర్ 17**



గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు గీసుకొండ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే మ్యూజిక్ ఆపరేటర్లు,సౌండ్ సిస్టమ్ నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా డీజేలు,సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న న్యాయస్థానాల ఆదేశాలు,ప్రభుత్వ నిబంధనలు,పోలీస్ శాఖ సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.అధిక శబ్దంతో డీజేలు నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం,శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం చేయరాదని స్పష్టం చేశారు.ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులకు నిర్వాహకులు సహకరించాలని కోరారు.ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రవి, అనిల్‌కుమార్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రియ కూరగాయలు సాగు పరిశీలలించిన అధికారులు

**కరపత్రం ప్రతినిది జగిత్యాల, సెప్టెంబర్ 17**



వెల్గటూర్ మండలం మండలం లోని వెంకటాపురం గ్రామము లోఎకరాములో సేంద్రియ సాగు చేస్తున్న రాందేని కోటయ్య తోటని ఆత్మ డైరెక్టర్ సుధాకర్ గారు పరిశీలించటం మరియు ఎలినోనో ప్రభావం దృశ్య కూరగాయల సాగు చేయాలని మల్చింగ్ ఎకరానికి 8000 సబ్సిడీ ఇవ్వటం జరుగుతుంది అని అలాగే పందిరి కూరగాయలు వేసె రైతులకి ఎకరానికి లక్ష సబ్సిడీ ఇవ్వటం జరుగుతుంది అని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆయిల్ పామ్ సాగు పెంచవలసిన అవసరం మన అందరికి ఉందని రైతులు సేంద్రియ సాగు వైపుకి రావాలని ఉద్యాన వన శాఖ అధికారులని సంప్రదించాలని కోరటం జరిగింది ఈ కార్యక్రమం లో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జగిత్యాల సుధాకర్ గారు మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి వంశీ కృష్ణ, ఏ ఈ ఓ రవళి, సర్పంచ్ బిళ్ళకూరి తిరుపతి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రైతులు పాల్గొనడం జరిగింది

## 16వ డివిజన్‌లో ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

- మోదీ చిత్రపటానికి పాలాభిషేకం.. పండ్లు, మిఠాయిల పంపిణీ
- బీజేపీ 16వ డివిజన్ డివిజన్ అధ్యక్షురాలు జాలిగాపు ప్రసన్న - రాంప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం



**కరపత్రం ప్రతినిది వరంగల్, సెప్టెంబర్ 17**

వరంగల్ నగరంలోని 16వ డివిజన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ డివిజన్ అధ్యక్షురాలు జాలిగాపు ప్రసన్న - రాంప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.వేడుకల్లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఈ సందర్భంగా నాయకులు ప్రస్తావించారు. ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గోదాసి అశ్విని కుమార్, జిల్లా సీనియర్ నాయకులు ఆరే కుమార్, సుంకరి రాజు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు బైకని వెంకటేష్, జిల్లా ఐటీ కన్వీనర్ బొమ్మగాని దిలీప్ కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు సంకతలా శ్రీనివాస్, సభావత్ నాగరాజు, సీనియర్ నాయకులు వేణు, డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు విజయ్, ఓబీసీ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, బూత్ అధ్యక్షులు నవీన్ కుమార్, కుమారస్వామి, రాజేష్ తదితరులతో పాటు 16వ డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం సెప్టెంబర్ 18,2026

# డీసీసీ భవన్‌లో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

» జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

» ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి





**కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 17**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..తెలంగాణ ప్రజల దశాబ్దాల నిరంకుశ పాలన నుంచి విముక్తికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సెప్టెంబర్ 17వ తేదీ నిదర్శనమని పేర్కొన్నారు. సాయుధ పోరాట యోధుల వీరోచిత త్యాగాలు, అమరవీరుల బలిదానాల పునాదులపైనే నేడు తెలంగాణలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని అన్నారు.గత పాలకుల హయాంలో ప్రజల గొంతుకలను అణచివేసే ప్రయత్నాలు జరిగాయని ఆమె విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు చేరువగా 'ప్రజాపాలన' అందిస్తోందని తెలిపారు. నాడు సోనియా గాంధీ ఇచ్చిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు ద్వారా ప్రజల వద్దకు తీసుకెళ్తోందని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వానికి తలుపులు తెరిచి పనిచేస్తున్నామని పేర్కొన్నారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలిగా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్‌రావు, లైబ్రరీ ఛైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, జిల్లా ఛైర్మన్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, డివిజన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఆర్‌జీపీఆర్‌ఎస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్గటూర్‌లో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**కరపత్రం ప్రతినిధి జగిత్యాల, సెప్టెంబర్ 17**



మండల కేంద్రంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీ విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, సంఘం సభ్యులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ సృష్టి, నిర్మాణం, శిల్పకళ, నైపుణ్యానికి ప్రతీకగా విశ్వకర్మ భగవాన్‌ను భావిస్తారని తెలిపారు. విశ్వబ్రాహ్మణుల వృత్తి నైపుణ్యం, కళా సంపద, సాంప్రదాయాలను భావితరాలకు అందించేలా సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యువత తమ పూర్వీకుల నుంచి వచ్చిన వృత్తి నైపుణ్యాలను కొనసాగిస్తూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సంకోజు తిరుమలచారి, ప్రధాన కార్యదర్శి రామగిరి నందయ్య, సంఘం నాయకులు సుద్దాల రమేష్, సుద్దాల సంతోష్, తోగిటి ప్రభాకర్, బ్రహ్మాండ్లపెల్లి సతీష్, కిషన్, అరుణ్, వడకపురం తిరుపతి, నందయ్య, బొందుగుల సత్తయ్య, జగదీష్, సంకోజు ఈశ్వర్, సంకోజు నరేష్, గొల్లపల్లి ఆనందం, కొండపర్తి వెంకటాచారి, తిప్పర్తి సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో అరాచక శక్తులను గద్దె దించుతాం

- సెప్టెంబర్ 17 పోరాటం గురించి కాంగ్రెస్, బీజేపీ చెప్తున్నవన్నీ అబద్ధాలే
- తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగుర వేసిన టీఆర్ఎస్ చీఫ్
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 17**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా గురువారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో ఆమె జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, అమరుల త్యాగాల చరిత్రకు నిదర్శనమని అన్నారు. ఆనాటి జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా ఈ గడ్డపై జరిగిన వీరోచిత పోరాటానికి విలీన దినోత్సవం గుర్తు అన్నారు. ఆనాటి పోరాటాన్ని కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుగా ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై జరుగుతున్న దాష్టీకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలే ఎదురొడ్డి పోరాటం చేశారే తప్ప ఈ కాంగ్రెస్, బీజేపీలు చేసిందేమీ లేదన్నారు. నిజాం పాలన నుంచి విముక్తి కోసం సాగించిన సాయుధ రైతాంగ పోరాటాన్ని కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం 'స్టేట్ కాంగ్రెస్' వల్లే జరిగిందని ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతుంటే.. ముస్లిం రాజుపై హిందువులు చేసిన మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఆ రెండు పార్టీల పాత్ర ఏమీ లేదని చెప్పారు. సంస్థానాల్లో రాజులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేయదని విధానపరమైన నిర్ణయం తీసుకున్నట్టుగా గాంధీ చెప్పారని గుర్తు చేశారు. ఈ పోరాటం జరిగిన సమయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనవాళ్లే లేవన్నారు. అయినా సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవం అంటూ ప్రజలను బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. వాళ్లు చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఈ పోరాటంలో పాల్గొకపోగా... భారత్ లో తెలంగాణను విలీనం చేసిన తర్వాత అంతకుముందు పేదలకు పంచిన పది లక్షల ఎకరాలను మళ్లీ జమీందార్లకు కట్టబెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు భూములు ఇవ్వడం కాదు పేదల నుంచి భూములు లాక్కుందని ఆ పార్టీ నిజ స్వరూపాన్ని తేటతెల్లం చేశారు.

**ప్రజలే ఎదురొడ్డి పోరాటం చేశారు**

జమీందార్లు, జాగీర్దార్లు ప్రజలపై సాగిస్తున్న దాష్టీకాలు, అన్యాయాలు, అఘాయిత్యాలను, హత్యాచారాలను నిరసిస్తూ ప్రజలే తిరుగుబాటు చేసి ఎదురొడ్డి పోరాటం చేశారే తప్ప ఇందులో ఆ రెండు రాజకీయ పార్టీల పాత్ర ఏమీ లేదన్నారు. ఈ పోరాటంలో హిందువులు, ముస్లింలు కలిసే పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపేందుకు దశాబ్దాల పాటు ఎంతో మంది మేధావులు కృషి చేశారని చెప్పారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాప రెడ్డి, రావి నారాయణ రెడ్డి వంటి మేధావులు ఊరూరా తిరిగి ప్రజలకు చదువు చెప్పారని, ఆంధ్ర మహాసభ ద్వారా ప్రజలను సంఘటితం చేశారని తెలిపారు. అదే సమయంలో కాళోజీ, దాశరథిల కలాల గర్జనలు, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినోద్దీన్ వంటి మహనీయుల కృషి కారణంగా ప్రజల్లో చైతన్య స్ఫూర్తి రగిలిందన్నారు. ఆ చైతన్యం నుంచే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ వంటి వీరులు పుట్టుకొచ్చారని గుర్తు చేశారు. మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి లాంటి మహనీయుల కృషి ఫలితంగా ప్రజలే తుపాకీ పట్టి దండు కట్టి వాళ్లను వాళ్లే రక్షించుకున్నారని అన్నారు.

**ఆనాటి యోధుల స్ఫూర్తితో అరాచక శక్తులను గద్దె దించుతాం**

ఈనాటి అరాచక శక్తులను గద్దె దించేందుకు ఆనాటి పోరాట యోధుల స్ఫూర్తి నేటి తెలంగాణకు ఎంతో అవసరమని అన్నారు. ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని నింపి వారి హక్కుల కోసం పోరాటం చేసేందుకు తెలంగాణ రక్షణ సేన పుట్టిందని చెప్పారు. తమ పోరాటంలో మతం, కులం, పేద, ధనిక అని కాకుండా ప్రజల అందరి హక్కుల రక్షణకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. తెలంగాణ ప్రజలకు తమను తాము ఎలా కాపాడుకోవాలో తెలుసని చెప్పారు.

# పుస్తెమెట్టెలు స్వర్ణకారులే విక్రయించే ఫైల్ పైనే మొదటి సంతకం

» విశ్వకర్మల జీవితాల్లో మార్పులు తెస్తాం

» విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, సెప్టెంబర్ 17**





తెలంగాణ రక్షణ సేన పార్టీని ప్రజలు ఆదరిస్తే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విశ్వకర్మల జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయాలు తీసుకుంటామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. పుస్తెలు, మెట్టెలు స్వర్ణకారులు మాత్రమే తయారు చేసి అమ్మే ఫైల్ పై మొదటి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించిన విశ్వకర్మ జయంతిలో పాల్గొని మాట్లాడారు. విశ్వకర్మల్లోని ఐదు దాయిలైన మను, మయ, త్వష్ట, విశ్వజ్ఞ, శిల్పిల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరముందని అన్నారు. విశ్వకర్మల్లోని ఐదు దాయిల పరిస్థితి మారాల్సిన అవసరముందని చెప్పారు. ఆ వృత్తుల్లో ఉండే కష్టాన్ని దగ్గరుండి చూశానని.. ఎన్నోసార్లు చట్ట సభల్లో ఈ అంశాలపై మాట్లాడానని గుర్తు చేశారు. కమర్షియల్ గోల్డ్ షాప్ లు వచ్చిన తర్వాత స్వర్ణకారుల జీవితాలు ఆగమయ్యాయని సైనెడ్ తిని సూసైడ్ చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్రంగులకు ఇన్సూరెన్స్, శిల్పులకు దేవాలయాల కమిటీల్లో స్థానం కల్పించాల్సిన అవరముందని అన్నారు. విశ్వకర్మలకు భూములు ఉండవని భూములు లేని వర్గాలకు భూమి పంపిణీ చేయాలన్న మంచి ఉద్దేశంతో భూలక్ష్మీ పథకాన్ని రూపొందించామని అన్నారు. భూలక్ష్మీ పథకానికి స్ఫూర్తి మారోజు వీరన్న, ప్రొఫెసర్ జయశంకర్ సార్, శ్రీకాంతా చారిలేనని చెప్పారు. జయశంకర్ సార్ తనకు తండ్రి తర్వాత తండ్రి లాంటి వారని ఆయన ఫోటో లేకుండా తమ పార్టీ కార్యక్రమం ఏదీ జరగదని చెప్పారు. విశ్వకర్మల కష్టం తెలిసిన బిడ్డనని తన పార్టీకి ఆశీర్వాదం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాలు పట్టించుకోక పోయినా సరే 40 ఏళ్లుగా విశ్వకర్మ జయంతిని ఘనంగా కుల పెద్దలు నిర్వహిస్తుండడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు.

# నూతన వధూవరులకు ఆశీర్వదించిన మంత్రి అడ్లూరి

- గొల్లపల్లి మండలంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ సుడిగాలి పర్యటన..



**కరపత్రం ప్రతినిధి గొల్లపల్లి, సెప్టెంబర్ 17**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గురువారం సుడిగాలి పర్యటన నిర్వహించి నూతన వధూవరులను ఆశీర్వదించడంతోపాటు ఇటీవల మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించడంతోపాటు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మంత్రి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు.గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సంగెం తిరుపతి కుమార్తె అభినయశ్రీ వివాహము నితిన్ తో ఇటీవల జరగగా నూతన దంపతులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం లక్ష్మీపూర్ గ్రామంలో ఆశీర్వదించారు. నూతన దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. గొల్లపల్లి మండలం మల్లన్న పేట గ్రామానికి చెందిన భీమ రాజమల్లు కుమారుడు భీమ రెడ్డి ఇటీవల మరణించగా రాజమల్లు కుటుంబాన్ని మంత్రి అడ్లూరి పరామర్శించారు. మల్లన్న పేట గ్రామానికి చెందిన నస్పూర్ రాజన్న ఇటీవల మరణించగా రాజన్న కుమారుడు సాయితో పాటు వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మల్లన్న పేట గ్రామానికి చెందిన గుండా సురేష్ ఇటీవల మరణించగా సురేష్ అన్న గుండ రాజన్న తో పాటు వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మల్లన్న పేట గ్రామానికి చెందిన మద్దెల గోవర్ధన్ ప్రమాదవశాత్తు చెయ్యి విరిగిన విషయం తెలుసుకున్న మంత్రి గురువారం మల్లన్న పేట గ్రామంలో గోవర్ధన్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మల్లన్న పేట గ్రామానికి చెందిన భీమ రాజమల్లు ఇటీవల మరణించగా మంత్రి లక్ష్మణ్ రాజమల్లు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గొల్లపల్లి మండలం వెంగళపూర్ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడగా మంత్రి లక్ష్మణ్ కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట గొల్లపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్న, నిశాంత్ రెడ్డి, బుచ్చిరెడ్డి, గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి తో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వక్ఫ్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి

- సర్వేకు సహకరించాలని దర్గా కమిటీ విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి వరంగల్, సెప్టెంబర్ 17**



వరంగల్‌లోని బిక్కన్ దర్వేష్ రహ్మతుల్లా అలై దర్గా పరిధిలోని వక్ఫ్ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని దర్గా కమిటీ సభ్యులు అధికారులను కోరారు. సర్వే నంబర్లు 273, 274, 275, 276లో ఉన్న సుమారు 15 ఎకరాల 5 గుంటల భూమికి సంబంధించి రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. భూముల సర్వే కోసం అధికారులు వచ్చిన సమయంలో కొందరు వ్యక్తులు సర్వే ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారని దర్గా కమిటీ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా అధికారులతో, కమిటీ సభ్యులతో వాగ్వాదం చోటుచేసుకుందని తెలిపారు. కమిటీ సభ్యుడు మహమ్మద్ అలీపై దాడికి ప్రయత్నించినట్లు కూడా వారు ఆరోపించారు.వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం గతంలో కలెక్టర్, రెవెన్యూ, పోలీసు అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన సర్వేను పూర్తిచేసి భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వక్ఫ్ బోర్డుకు నివేదించాలని కోరారు.భూములపై ఏవైనా వివాదాలు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత పత్రాల ఆధారంగా అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలని, సర్వే ప్రక్రియకు ఆటంకం కలగకుండా అన్ని వర్గాలు సహకరించాలని దర్గా కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పరిస్థితి పునరావృతం కాకుండా సంబంధిత పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ పాషా, ఉపాధ్యక్షుడు మహమ్మద్ మాస్వాక్, కోశాధికారి మహమ్మద్ జైనుల్ అబిద్దీన్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ పాషా, మహమ్మద్ అలీ, మహమ్మద్ అజాజ్, మిర్జా యూసుఫ్ బేగ్, ఇనాయతుల్లా ఖాన్